

ఆ పాడు బావి సంగతి ఇప్పడెందుకు. వెంకయ్య సంసారం హాయిగా సాగిపోతోంది. అతని మొదటి భార్య కరుణ బావిలో శవమై తేలిన సంగతి అందరూ తేలిగ్గా మరచిపోయారు. ఇప్పటికే ఐదేళ్లు గడిచిపోయాయి. ఇంకో పదేళ్లు గడిచిపోతాయి. ఇప్పడా సంగతెందుకు? ఇప్పుడు వెంకయ్య సంసారం పిల్లాపాపల్తో అన్యోన్యంగా గడిచిపోతోంది. కర్మకాలి కరుణ చచ్చిపోయింది. ఊళ్ళో ఎంతమంది చావడం లేదు? అయినా నువ్వు చెప్పమని పీక్కుతింటున్నావు కనుక ఆ పాడుబావి కథ చెప్తా, సిగరెట్ ఇలా పడెయ్.

# పాడుబావి

## రాణి శివశంకర్




.............

వెంకయ్య పాములపాడులో పెద్ద ఆసామి కొడుకు. పంచాయతీ ఎన్నికలలో వూరు రెండుగా చీలిపోయాక వొక వర్గానికి నాయకుడయ్యాడు. యువకుడు, ఉడుకు రక్తం.

తగాదాల్లో రిస్కు వున్నా మజా, థ్రిల్ కూడా వున్నాయి. ఇతరుల్ని కొట్టడం, భయపెట్టడం, హతమార్చడం, పొగరుగా మీసం మెలేస్తూ 'ఏయ్ నా కొడకల్లారా పోతుమొగోళ్ళైతే ముందుకురండిరా నరికి నెం... లంజకొడకల్లారా' ఇలా సవాలు విసుర్తూ మారణాయుధాలతో స్వైరవిహారం చేయడంలోని మజా అతనికి తొందరలోనే అనుభవంలోకి వచ్చింది.

తగాదా మొదలైంది. వెంకయ్య తన ముఠాతో బాంబులు విసుర్తూ సవాలుచేస్తూ బయలుదేరాడు. ప్రత్యర్థి వర్గపు మగాళ్లందరూ వూరి నుంచి పరార్. ముసలీ ముతకా, కొందరు ఆడవాళ్లూ మిగిలారు. ఒక వివాహితని తన గుంపుతో కలిసి పట్టుకుని బలాత్కారం చేశాడు వెంకయ్య. వేడ్కోళ్ళూ కన్నీళ్ళూ కనికరం కలిగించలేదు. కనికరం, దయ లాంటి పదాలన్నీ ఆ వూళ్ళో పట్టి చేవ లేని మగతనం లేని పదాలుగా మిగిలిపోయాయి. ఇదంతా వీరత్వం పౌరుషం!

అప్పుడే వెంకయ్యకి పెళ్ళి కుదిరింది. తెల్లని సిల్కు పంచ కట్టుకుని సెంటు పులుముకుని మీసాన్ని సాపుగా దువ్వి పెళ్ళి చూపులకి వెళ్ళినప్పుడు, అతన్ని చూసి మగాడంటే వీడు అనుకున్నారందరూ. పెళ్ళికూతురు కూడా మనసులో మురిసిపోయింది. అతనికేం తక్కువ. మగాడెన్ని చేసినా నెగ్గుకుపోగలడనుకుంది.

పెళ్ళైపోయింది. కరుణ గర్భవతి. ఈలోగా అల్లర్లు. గ్రామ కక్షల క్రమంలో వెంకయ్య వేట కొడవలితో వొకణ్ణి నరికి చంపాడు. మొండాన్నొకదాన్ని నులక మంచానికి కట్టి నదివైపు పరుగు తీశాడు. అవయవాలన్నింటినీ ముక్కలు చేసి నదిలో వేరువేరుచోట్ల పడేశారు.

వెంకయ్యని, అతని అనుచరుల్ని అరెస్టుచేసి జైలులో పెట్టారు. అతని ముఠాకి చెందిన మిగిలిన మగవాళ్లు ప్రాణభయంతో వూరు విడిచి పోయారు.

ఇపుడు ప్రత్యర్థి వర్గానిదే పైచేయి. మారణాయుధాలతో గుంపుగా దాడికి బయలుదేరారు. మగ పురుగే లేదు. గర్భిణి యైన కరుణని బలాత్కరించారు. కన్నీళ్ళూ యేడ్పులూ పట్టించుకునే దిక్కే లేదు. అడ్డం వచ్చిన ఆడవాళ్ళని, ముసలివాళ్ళని కొట్టి తరిమేశారు. మొగదిక్కే లేని భయంకర రాత్రి.

యేం చేయగలరు! ఇరుగు పొరుగు ఆడవాళ్ళు వోదార్చారు "ఇయన్నీ ఈ వూళ్ళో మామూలే కదమ్మా ఆడపుటక పుట్టినందుకు మనం ఇలా కుమిలి కుమిలి సావాల్సిందే. గుండె రాయి సేసుకోవాల"

జరిగిందాని వల్ల వచ్చిన మానసిక శారీరక బాధలు సరే అసలు అగ్నిగుండం ముందుంది. ఈ సంగతి భర్తకు చెప్పాలా? దాస్తే దాగుతుందా? పెళ్ళాం శీలాన్ని కాయలేని మొగుడు పాడు బావిలో దూకి సావడమే మేలనే తన పెనిమిటికి ఈ సంగతి తెలిస్తే...? ఓదార్పైనా లభిస్తుందా? గతంలో అతని తప్పలనీ, నేరాలనీ మగవాళ్ల దౌర్బల్యాలుగా క్షమించింది, అవే తనకెదురొచ్చి బలికోరాయి.

అసలు బలాత్కారమంటే ఏమిటి అని ప్రశ్నించుకుంది కరుణ. మొరటు మనస్తత్వంతో, మొరటు చేతులతో ఇష్టాయిష్టాల్ని గమనించకుండా ఒక జంతువులా భర్త తనని ఆక్రమించుకున్నదానికీ, ఈ బలాత్కారానికి పోలిక కనిపించింది. దిగులూ భయమూ వేదనా ముప్పిరిగొని చీకటిలోకి కుంగిపోయింది. పాడుబావిలో విష కీటకాల మధ్య నివసిస్తున్నట్టనిపించింది.

వెంకయ్య బెయిలుపై బైటికి వచ్చాడు. భార్య దగ్గర తన పౌరుష పరాక్రమాల గురించి గప్పాలు మొదలుపెట్టాడు. ఆమె దిగులుగా వుందని గుర్తించి "నువ్వేం బయపడమాకు. మగోడన్నోడు మగోడిలా బతకాల. ఈ కేసులూ కష్టాలూ రెండేళ్ళలో గట్టెక్కేస్తా. మనకి చాలా బలగముంది. కొంత ఖర్చైతే కానీ. ఆ నా కొడుకుని నరికిపారేసేదాకా కంటిమీద కునుకే లేదు"

సాయంకాలం అరుగుమీద గుంపు మూగారు. చుట్టలు భగ్గుమంటున్నాయి. "మొగోడివంటే నువ్వన్నా" అని భుజం తట్టారు. "ఏట కొడవలితో మీదికి దూకితే నాకొడుకు వుచ్చ పోసుకుని కాళ్ళు పట్టుకుని... ధూ యవ్వ వాడూ మగాడేనా? చీమని చంపుతున్నట్టనిపించింది" అన్నాడు వెంకయ్య.

ఈ పోట్లగిత్తల కుమ్ములాటలు ఉద్రేకాల మధ్య గాయపడిన సున్నితమైన మనసుల్ని పట్టించుకునేవాళ్ళూ, వోదార్చేవాళ్ళూ యెవరు?

నాగయ్య కొందరు సావాసగాళ్ళతో కలిసి కాఫీ హోటల్ దగ్గర యెదురయ్యాడు వెంకయ్యకి. "గాజులు తొడుక్కున్నోళ్ళు జబ్బ సరవడమేందిరా" అన్నాడు వెటకారంగా తన గుంపుతో వెంకయ్య. "ఏయ్ యేందిరా" అంటూ కలబడ్డాడు నాగయ్య. "నీ గురించెవరు మాట్టాడుకోలటా్రా నువ్వో మగాడివా" అన్నాడు నెడ్తూ వెంకయ్య. "మరి నువ్వో మగాడివి. నీ పెళ్ళాం కత తెలిస్తే పాడు బావిలో దూకి సత్తావ్"

ఇంటికి పరిగెత్తి పెళ్ళాన్ని విసిరికొట్టాడు వెంకయ్య. "యెవడబ్బతో తొంగున్నావో సెప్పే" నిండు చూలాలన్న కరుణ లేకుండా కొడ్తున్నాడు. చుట్టుపక్కలవాళ్లే చూసినా ఎలా వారించగలరు? ఆమె అతని భార్య. బలహీనంగా మూలిగింది "బలవంతం"

"ఆడెవడో అబగా మీదికి దూకుతుంటే నువ్వేం సేత్తున్నావే. పోనీలే ఇదే బాగుందనుకున్నావా లం...."

ఆమె బోరుబోరున ఏడ్చేడ్చి అలసి సొలసి పడిపోయింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా గిలక చప్పడైనా వినబడని పాడుబావిలా మారిపోయింది. భర్త మాట్లాడడు. ముసలి అత్తగారు కిమ్మనదు. పుండుమీద కారం.

ఒకరోజు వెంకయ్య అన్నాడు గంభీరంగా "చెడిపోయావని చెప్పి నిన్ను మీ ఇంటికాడ దించేస్తా. నీ బతుకేదో నువ్వు బతుకు"

పత్తి పంట గిట్టుబాటు కాక దివాళా తీసి వురివేసుకుని చచ్చిపోయాడు తండ్రి. దిక్కులేని తల్లి యేమి ఆదరించగలదు. "సచ్చినా బతికినా నీ కాళ్ళకాడే" అంది. సరేనన్నాడు.

కడుపులో శిశువు కదుల్తున్నాడు. "చూడండి బిడ్డ యెలా తంతున్నాడో" అంటూ నవ్వుతూ భర్త పొట్టకి పొట్టని ఆనించింది. ఎప్పటిలాగే స్పందన లేకుండా మౌనంగా పరధ్యానంగా పైకప్పకేసి చూస్తూ పడుకున్నాడు. "ఇలా మాటల్లేకుండా పొద్దుగూకులూ సంపేకన్నా వొకేసారి పీక నులిమి సంపెయ్" అంది.

ఒకరోజు ఉదయమే అదిగో ఆ పాడు బావి పక్కనుంచి కాలకృత్యాల కోసం నడిచిపోయింది కరుణ. తరువాత పాడుబావిలో శవమై తేలింది. ఎవరు చంపారో ఎలా చంపారో? వెంకయ్యే కొందర్ని పురమాయించి చెడిపోయినదాన్ని వదిలించుకున్నాడని చెవులు కొరుక్కున్నారు. చాటుమాటుగా హీనస్వరంతో కొందరు ఆడవాళ్లు అన్యాయమన్నారు. గొంతెత్తి అరచినవాళ్ళెవరూ లేరు. పాడుబావిలోని భయంకర నిశ్శబ్దమే వూరిని మింగేసింది.

వెంకయ్య గుండెలు బాదుకుని ఏడ్చాడు. కర్మకాండ వైభవంగా జరిపాడు. వూరంతటికీ వేటకూరతో భోజనాలు పెట్టించాడు. సారా పోయించాడు. అంతటితో సరి.

వెంకయ్య రెండో పెళ్ళి వైభవంగా జరిగిపోయింది. ఇప్పడు వారి సంసారం పిల్లాపాపల్తో చూడముచ్చటగా సాగిపోతోంది.

పాడుబావి పక్కగా వెళ్ళినపుడల్లా వెంకయ్య భార్య అడుగులు దిగులుగా, భారంగా పడ్తాయి. బెరుకు బెరుకుగా మొహం పక్కకి తిప్పేస్తుంది. ■

వచ్చేవారం కథ
**ప్రతిబింబాలు**
– కిరణ్మయి